www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 29 జనవరి 2023
5
పశ్చిమ గోదావరి

పశువుల వద్దకే వైద్యసేవలు

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

ప్రజాశక్తి- తణుకు

నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పశువుల వద్దకే వైద్య సేవలు అందిస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శనివారం డాక్టర్ వైఎస్ఆర్ సంచార పశువైద్య వాహనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పెద్దసంఖ్యలో వాహనాలను సిఎం జగన్మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. ఈ వాహనాల ద్వారా పశువులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

ఆదిలోనే అష్టకష్టాలు..!

పూర్తికాని రబీ వరి నాట్లు - వంతుల విధానంలో సాగునీరు - పొలాలకు నీరందక రైతన్నల అవస్థలు



ఆచంట వేమవరంలో ఇంకా దమ్ము కూడా చేయని పంట భూములు

ప్రజాశక్తి - ఆచంట

రబీ సాగు ఆరంభంలోనే సాగునీటి ఎద్దడి రైతన్నలను ఆందోళనకు గురిచేస్తోంది. ఇంకా కొన్ని ప్రాంతాల్లో వరినాట్లు సాగుతుండగానే నీటి కొరత తలెత్తడం ఇబ్బందికర అంశంగానే చూడాలి. కాలువల్లో సమృద్ధిగా నీరు లేకపోవడం.. పంట కాలువలు పూడికతో నిండటం వంటి కారణాలతో సకాలంలో సాగునీరందక నాట్లు ప్రక్రియ పూర్తి కాలేదు. గోదావరిలో నీటి లభ్యత దృష్ట్యా వంతులవారీ విధానాన్ని అధికారులు అమలులోకి తీసుకొచ్చారు. దీంతో రైతులకు ఇక కష్టాల వంతు తప్పేటట్లు లేదు. దాళ్వా సాగులో నారుమడుల దశ నుంచి రైతులు తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారు. కాలువల్లో సమృద్ధిగా నీరు లేకపోవడం, పంట కాలువలు తూడు, గుర్రపుడెక్కతో నిండిపోవడం వంటి సమస్యలు వల్ల నీరందక నాట్లు బాగా ఆలస్యమయ్యాయి.

మండలంలో ఆచంట వేమవరం రైతులకు ప్రతియేటా సాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఖరీఫ్‌లో ముంపు, రబీలో నీటి ఎద్దడి ఎదురవుతుండటంతో రైతులకు సాగు కత్తి మీద సాములా మారిం ది. ఆ గ్రామం మొత్తం మీద 1100 ఎకరాల్లో వరి సాగు ఉండగా రబీలో సుమారు 800 ఎకరాల్లో సాగునీటి సమస్య తలెత్తడం పరిపాటిగా మారింది. దీంతో నేటికీ దమ్ములకు సైతం నీరందని పరిస్థితి ఉండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

కాల్వల్లో పూడిక.. ఆక్రమణలు

మొత్తం ఆయకట్టుకు జగ్గరాజు కాలువ, బాలంవారిపాలెం ఛానల్ ద్వారా సాగునీరు అందుతుంది. ప్రధాన కాలువలతో అనుసంధానమైన ఉపకాల్వలు, బోదెలు ప్రస్తుతం గురపు డెక్కతో నిండిపోగా ఆక్రమణలతో అవి కుచించుకుపోయాయి. దీంతో ఇటు పడమటిపాలెం, అటు వద్దిపర్రు రహదారులను ఆనుకుని ఉన్న ఆయకట్టుకు నీరు చేరడం గగనంగా మారింది. ఇదేవిధంగా పాలకొల్లు ఆర్‌అండ్‌బి రహదారికి ఇరువైపులా ఉన్న ఆయకట్టుకు కూడా సాగునీటి ఇబ్బందులు తలెత్తాయి. ఆచంట వేమవరంలో నీరందక దమ్ములు సైతం ఎండిపోతున్నాయంటే అతిశయోక్తి కాదు. దీంతో రైతులు పవర్ టిల్లర్ల ద్వారా, ఆయిల్ ఇంజిన్ల ద్వారా నీటిని తోడుకుంటూ అరకొరగా పనులు సాగిస్తున్నారు. గోదావరిలో నీటి లభ్యత తక్కువగా ఉన్న దృష్ట్యా నీటిని పొదుపు చేసేందుకు వంతులవారీ విధానం ప్రారంభిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో నాట్లు పూర్తికాక ముందే వంతులవారీ విధానం వస్తే పంట చేతికొచ్చే వరకూ మిగిలిన కాలమంతా పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇంకా నాట్లే వేయలేదు

తాళం నాగరాజు, కౌలురైతు, ఆచంట వేమవరం

దాళ్వా ప్రారంభంలోనే సాగునీటి ఎద్దడి ఏర్పడింది. ఆచంట వేమవరం గ్రామంలో రైతులకు అతివృష్టి, అనావృష్టి సమస్యలు వెంటాడుతున్నాయి. సార్వా సీజన్‌లో పంట ముంపుబారిన పడటం, రబీ సీజన్‌లో సాగునీటి కొరతతో మా కంటకన్నీరు తప్పడం లేదు. నీరందక ఇంజిన్లతో తోడుకుంటూ దమ్ములు చేసుకుంటున్నాం. ఇంకా నాట్లే పూర్తికాలేదు.

మా గ్రామంపై ప్రత్యేక దృష్టి పెట్టండి

బొర్ర నరసింహారావు, కౌలురైతు, ఆచంట వేమవరం

శివారు ప్రాంతం కావడంతో ఏటా రబీ సీజన్లో సాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. నీరందక దమ్ములు సైతం చేయలేదు. నారుమడులు ముదిరిపోతున్నాయి. ప్రతి సంవత్సరం అప్పులు తప్ప మిగులు ఉండటం లేదు. సాగునీటికి ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వస్తోంది. గోదావరికి వరదొచ్చినప్పుడల్లా మా పంట పొలాలు మునిగిపోతుంటాయి. దీంతో ప్రతి సంవత్సరం రబీ సాగు ఆలస్యమవుతుంది. అధికారులే ప్రత్యేక చర్యలు తీసుకుని మాకు సాగునీరు సమృద్ధిగా అందించాలి.

సాగునీటి పంపిణీలో ఇక వంతులే

జిల్లా జల వనరుల శాఖాధికారి నాగార్జునరావు

ప్రజాశక్తి - భీమవరం

రబీ సాగుకు నీటి విడుదలలో శనివారం నుంచి వంతుల వారీ విధానం అమలు చేస్తున్నట్లు జిల్లా జల వనరుల శాఖాధికారి పి.నాగార్జునరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గోదావరి నుండి నీటి లభ్యత తక్కువగా ఉండటం వల్ల రబీ సాగుకు అందరికీ నీటిని అందజేయాలనే ఉద్దేశంతో కాలువలకు నీటి విడుదలలో వంతులవారీ విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఏఏ మండలాల పరిధిలో, ఏఏ తేదీల్లో సాగునీరు విడుదల వంటి వివరాలను రైతుభరోసా కేంద్రాలు, మండల వ్యవసాయాధికారుల ద్వారా విస్తృత ప్రచారం చేయిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రతి ఎకరాకూ సాగు నీరందించాలి : సిపిఎం

ప్రజాశక్తి - భీమవరం

నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించి ప్రతి ఎకరాకూ సాగునీరు అందించాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దాళ్వా సాగుకు నీటిఎద్దడి రాకుండా రాష్ట్ర, జిల్లా అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలో పలుచోట్ల నుండి దాళ్వా సాగుకు నీటి ఎద్దడి సమస్య తలెత్తుతుందని పేర్కొన్నారు. నీరందకపోవడం, పంట ఎండిపోవడం వంటివి రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయని తెలిపారు. తక్షణం జిల్లా యంత్రాంగం, నీటి పారుదల శాఖ, రాష్ట్ర ప్రభుత్వం నీటి ఎద్దడి రాకుండా, రైతులు ఇబ్బందులకు గురి కాకుండా, పంట నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సాగునీటి సలహా మండలి సమావేశంలో దాళ్వా సాగుకు ఎలాంటి నీటి ఎద్దడి సమస్య ఉండదని చెప్పిన అధికారులు దాళ్వా సాగు ప్రారంభ సమయంలోనే నీటిఎద్దడి రావడంపై స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఎండలు పెరిగితే సమస్య మరింత జఠిలమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఎకరాకూ సాగు నీరందించాలని డిమాండ్ చేశారు. పంట ఎండిపోయినా, నష్టపోయినా రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. లస్కర్లకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఉండి మండలం చెరుకువాడలోని పాఠశాలలో మరుగుదొడ్డికి తాళం వేసి ఉండటంపై ప్రశ్నిస్తున్న ప్రవీణ్‌ప్రకాష్

లక్షల్లో జీతాలు తీసుకుంటూ ఈ పనులేంటీ

విద్యాశాఖ ఉన్నతాధికారులపై ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ ఆగ్రహం

ప్రజాశక్తి - ఆకివీడు

మండల కేంద్రం ఆకివీడులో..

లక్షలాది రూపాయలు జీతం తీసుకుంటూ లక్ష్యం లేకుండా పని చేయడం ఏమిటని విద్యాశాఖ ఉన్నతాధికారులపై ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మండల కేంద్రం ఆకివీడులోని రెండు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక ఈస్ట్‌పాలెం పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలించి ఆర్‌జెడి, డిఇఒ, ఎంఇఒలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత జులై తర్వాత పాఠశాల తనిఖీకి రాని మీరు ఉత్తమ పాఠశాలలను ఎలా ఎంపిక చేస్తారని ఆర్‌జెడిని ప్రశ్నించారు. రికార్డులను తనిఖీ చేసి వాటిలో లోపాలను ఎత్తిచూపారు. లోపాలకు కారణాలపై సంబంధిత అధికారుల నుంచి సంజాయిషీ కోరాలని కలెక్టర్ ప్రశాంతిని ఆదేశించారు. తొలుత స్థానిక శివాలయం ఎంపిపి పాఠశాలను పరిశీలించారు. చేసే పనిలో చిత్తశుద్ధి ఉండాలని, లక్ష్యం లోపిస్తే ఉద్యోగం అనవసరమని అన్నారు. నాడు-నేడు పనులపై ఇంజినీరింగ్ అధికారుల పని తీరులో మార్పు రావాలన్నారు. ఆయన వెంట కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ, ఎస్ఎస్ఎ కోఆర్డినేటర్ శ్యామ్‌సుందర్, ఆర్‌జెడి మధుసూదనరావు, డిఇఒ వెంకటరమణ, డివైఇఒ శ్రీరామ్, ఎంఇఒ రవీంద్ర, తహాశీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు ఎంపిడిఒ శ్రీకర్ తదితరులు ఉన్నారు.

ఉండి: విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన సాగించాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ ఉపాధ్యాయులను ఆదేశించారు. శనివారం మండలంలోని చెరుకువాడ, ఎన్ఆర్‌పి.అగ్రహారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌ప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి ఎనిమిదో తరగతిలో సిబిఎస్ఇ సిలబస్‌ను తీసుకురావడంతో విద్యార్థులకు చదువు ఇబ్బందిగా ఉంటుందనే ఉద్దేశంతో బైజూస్ కంటెంట్‌తో ఉన్న ట్యాబ్‌లను ఇచ్చామన్నారు. ప్రతి విద్యార్థీ ఆ ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలకు ఒక వాచ్‌మెన్‌ను నియమిస్తామన్నారు. చెరుకువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లకు తాళం వేసి ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి పాఠశాలలో ఆర్‌ఒ ప్లాంట్లను ఏర్పాటు చేసి శుద్ధి చేసిన జలాలను విద్యార్థులకు అందించాలని సూచించారు. పాఠశాలల విలీనం ఆలస్యంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి విద్యాబోధన ఎలా ఉంది అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఉన్నతాధికారులతోపాటు ఎంఇఒ ఎ.రవీంద్ర ఉన్నారు.

అత్తిలి: జిల్లాలోని 13 జూనియర్ కాలేజీల్లో మార్చి 16వ తేదీలోపు మరమ్మతులు పూర్తి చేసి పరీక్షలకు సిద్ధం చేయాలని, లేనిపక్షంలో అధికారులపై చర్యలు తప్పవని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ హెచ్చరించారు. శనివారం స్థానిక ఎస్‌విఎస్ఎస్ ప్రభుత్వ కళాశాలలో నాడు-నేడు పనుల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మరమ్మతులు, నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు మంజూరు చేసినా పనులు ఎందుకు నిర్ణీత సమయానికి పూర్తి కాలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులతోపాటు ఇన్‌ఛార్జి ఎంఇఒ డి.శారదాజ్యోత్స్న, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.ప్రేమ్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

అత్తిలిలో..

లక్ష్య సాధనకు కృషి చేయాలి

హైకోర్టు జడ్జి నైనాల జయసూర్య

తణుకురూరల్: అబ్దుల్‌కలాం వంటి ఉన్నత వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని నిరంతరం లక్ష్య సాధనకు కృషి చేయాలని హైకోర్టు జడ్జి నైనాల జయసూర్య అన్నారు. శనివారం స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల ప్రాంగణంలో పట్టభద్రుల స్నాతకోత్సవం కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. తొలుత జ్యోతిప్రజ్వలన చేసిన జడ్జి జయసూర్య అనంతరం సభలో మాట్లాడారు. ఐటి, బ్యాంకింగ్, ఏవియేషన్ రంగాల్లో మహిళలు ముందుంటున్నారన్నారు. జీవితంలో ఏమి సాధించాలి అనే దానిపై అవగాహన ఏర్పర్చుకోవాలని, ఎంచుకున్న వృత్తి పట్ల నిబద్ధతతో న్యాయపరంగా ముందుకుసాగాలని విద్యార్థినులకు సూచించారు. తణుకు పట్టణంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత(బాలుర) పాఠశాల పూర్వ విద్యార్థినని గుర్తు చేసుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందిస్తూ, అన్ని రంగాల్లో విద్యార్థినులను ప్రోత్సహిస్తూ క్యాంపస్ డ్రైవ్ ద్వారా విప్రో, ఇన్ఫోసిస్, జెన్‌పాక్, డిలాయిట్ వంటి ప్రసిద్ధ సంస్థల్లో విద్యార్థినులు ఉద్యోగాలు సాధించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. 2019-20, 2020-21, 2021-22 విద్యా సంవత్సరాల్లో పట్టభద్రులైన సుమారు 1100 మంది విద్యార్థినులకు హైకోర్టు న్యాయమూర్తి జయసూర్య, ఎస్‌కెఎస్‌డి గ్రూప్ ఆఫ్ కాలేజీ అధ్యక్షులు కెవి.సుబ్బారావు, కళాశాల కరెస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు పట్టాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి నందిగం సుధాకర్, పరిపాలనాధికారి డాక్టర్ డి.సుబ్బారావు, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ కెవి.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ యుఎల్.సుందరీబాయ్, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు

అధికారులకు డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశం

భీమవరం రూరల్: శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని డిజిపి కెవి.రాజేంద్రనాథ్‌రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక విష్ణు కళాశాలలో జిల్లా పోలీసు అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత జిల్లా ఎస్‌పి యు.రవి ప్రకాష్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఎస్‌పి రవిప్రకాష్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లా కొత్తగా ఏర్పాటయ్యాక సబ్ డివిజన్లు, స్టేషన్ల వివరాలు, జిల్లాలో వివిధ కేసుల వివరాలు, రోడ్డు ప్రమాదాలు, వాటి నివారణకు తీసుకుంటున్న చర్యలు, దిశా యాప్ వినియోగం, గంజాయి నియంత్రణకు చర్యలు తదితర అంశాలు వివరించారు. ఈ సందర్భంగా డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటైన ఈ జిల్లాలో చోరీసొత్తు రికవరీ బాగుందని ప్రశంసించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఏలూరు రేంజ్ ఐజి పాలరాజు, జిల్లా ఎస్‌పి రవి ప్రకాష్, ఎఎస్‌పి సుబ్బరాజు, ఎస్ఇబి ఎఎస్‌పి విటి.రవికుమార్, భీమవరం డిఎస్‌పి శ్రీనాథ్, నర్సాపురం డిఎస్‌పి మనోహరాచారి, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

31న సమరయాత్ర సభ

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వాసు

ప్రజాశక్తి - భీమవరం

వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం విద్యార్థి, యువజన సంఘాలు, ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన సమర యాత్ర ఈ నెల 31న భీమవరం రానుందని, ఈ నేపథ్యంలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.వాసు కోరారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి టి.ప్రసాద్ అధ్యక్షతన శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వాసు మాట్లాడుతూ ఈ నెల 25 నుండి ఫిబ్రవరి 4వ తేదీ వరకు హిందూపురం నుండి ఇచ్ఛాపురం వరకు సమరయాత్ర కొనసాగుతుందని, ఈ యాత్ర 31వ తేదీ మధ్యాహ్నం భీమవరం పట్టణం చేరుకుంటుందని తెలిపారు. దీనిలో భాగంగా పట్టణంలో విద్యార్థులు, యువకులతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు జిల్లా ప్రజలు, మేధావులు, యువకులు హాజరై రాష్ట్ర ప్రజలకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.ధనుష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి కల్పించాల్సి ఉండగా దానికి భిన్నంగా ప్రభుత్వరంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరించడం యువతకు అన్యాయం చేయడమేనన్నారు. కేంద్ర విద్యాసంస్థలను జిల్లాలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కె.నాని మాట్లాడుతూ 25 మంది ఎంపీలను ఇవ్వండి ప్రత్యేక హోదా తీసుకొస్తానని బీరాలు పలికిన జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు మౌనం వహించారని ప్రశ్నించారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.సుందర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రత్యేక హోదా, విభజన హామీల సమస్యలపై సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు యు.వినోద్, బి.గణేష్, పి.మోహిని లక్ష్మి, శ్రీను, పిడిఎస్‌యు నాయకులు మహర్షి పాల్గొన్నారు.

చట్టాలకేదీ రక్షణ..!

1/70, కార్మిక చట్టాల పరిరక్షణ ఉద్యమం ఉధృతం
రైతు యాత్రలు విజయవంతం
రోడ్డెక్కిన 108, అంగన్‌వాడీలు
ప్రజా సమస్యలు పట్టని బిజెపి పెద్దల సమావేశం

మన నేతలు తరచూ చెప్పే మాట 'చట్టం తన పని తాను చేసుకుపోతుంది'. మరి ఆ చట్టాన్నే అమలు చేయాలని ఇప్పటి వరకూ ఆందోళనలు, పోరాటాలు సాగేవి. కేంద్రంలో బిజెపి పాలకుల తీరుతో ఆ చట్టాలను పరిరక్షించండి అంటూ వాటి రక్షణ కోసం సగటు జీవి పోరాడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికే 44 కార్మిక చట్టాలను యథాతథంగా కొనసాగించాలని దేశవ్యాప్తంగా కార్మికులు పెద్దఎత్తున ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ కోవలోకే వస్తుంది 1/70 చట్టం పరిరక్షణ ఉద్యమం. జిల్లాలో ఐదు ఏజెన్సీ మండలాలు పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు ఉన్నాయి. వీటిలో రాష్ట్ర విభజనకు ముందున్న పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో 1/70, పీసా చట్టాలు అమలు చేయాలని చాలాకాలంగా పోరాటాలు సాగుతున్నాయి. ఆ మూడు మండలాల పరిధిలోనే సుమారు 50 వేల ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి గిరిజన శాఖా మంత్రి రెడ్యానాయక్ ప్రకటించడం, ఆ భూముల వెలికితీతకు చర్యలు తీసుకుంటామని నాడు ప్రభుత్వం ప్రకటించి ఏళ్లు గడిచాయి. నేటికీ ఆ భూముల సంగతి అతీగతీ లేకపోయినా తాజాగా పోలవరం ప్రాజెక్టు, ఇతర ప్రాజెక్టుల పేరుతో అటవీ భూములను నిలువునా ముంచుతూ ఏజెన్సీ ధ్వంసం పెద్దఎత్తున సాగుతోంది. ఇదంతా చట్టవిరుద్ధంగా అధికారయంత్రాంగం, ప్రభుత్వ పెద్దల కన్నుసన్నలో సాగిస్తుండటం ఆందోళనకరం. అటవీహక్కుల చట్టాన్ని ఈ పాలకులు, అధికారులు అటకెక్కించిన సంగతి తెలిసిందే. చివరకు కోర్టుల తీర్పులను సైతం పక్కనపెట్టి గిరిజనుల భూముల్లో గిరిజనేతరులు పంట సాగు చేస్తుంటే అధికారులు వారికి రక్షణ కల్పిస్తుండటం గమనార్హం. పోలవరం నిర్వాసితులకు భూమికి భూమి కేటాయింపు అంశంలోనూ అధికారుల తీరు వివాదాస్పదమైంది. ఈ మొత్తం వివాదాలన్నింటినీ పరిశీలిస్తే 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయకపోవడమే కారణమని స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో చట్టాన్ని సక్రమంగా అమలు చేయాల్సిన పాలకులు ఆ చట్టానికి తూట్లు పొడిచి దాని మనుగడకే చేటు తెచ్చేలా వ్యవహరిస్తున్నారు. ఆ చట్టం గూర్చి సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు కావడమే దీనికి నిదర్శనం. ఇప్పటికైనా పాలకులు వట్టిమాటలు కట్టిపెట్టి గిరిపుత్రుల గుండెకాయ వంటి 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని అంతా కోరుతున్నారు.

వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో సాగిన రైతాంగ ఉద్యమం అందరికీ తెలిసిందే. ఆ సందర్భంగా ఇచ్చిన హామీల అమలు కోసం రైతులు మళ్లీ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు రోడ్డెక్కాల్సి వచ్చింది. గణతంత్ర దినోత్సవం నాడు జిల్లాలో ఏలూరు, చింతలపూడి, భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం ప్రాంతాల్లో రైతులు ట్రాక్టర్లతో ర్యాలీలు నిర్వహించి గళమెత్తారు. పంటలకు మద్దతు ధర చట్టంతోపాటు మద్దతు ధరల అమలుకు గ్యారెంటీ చట్టం తీసుకురావాలనేది రైతుల ప్రధాన డిమాండ్. జిల్లాలో గత దాళ్వా, సార్వా సీజన్లలో రైతులు ధాన్యం అమ్ముకోవడానికి పడిన కష్టాలు అన్నీఇన్నీ కావు. గతంలో ఎన్నడూ లేనంతగా పంట అమ్ముకోవడానికే రోడ్డెక్కాల్సి రావడం రైతులను ఆలోచింపజేసింది. ఫలితంగా రైతు ర్యాలీలు విజయవంతమయ్యాయని చెప్పొచ్చు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆ హామీల అమలుకు కార్యాచరణ ప్రకటిస్తుందా లేక మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా వంటి ప్రధాన అంశంలో చేసిన మోసాన్నే దేశవ్యాప్తంగా రైతుల విషయంలోనూ కొనసాగిస్తుందా లేక తీరు మార్చుకుని ఇచ్చిన హామీ అమలు చేస్తుందా అనేది వేచిచూడాలి.

ఇక అంగన్వాడీలు ఫేస్‌యాప్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని అంగన్వాడీలు, తమ సమస్యలు పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ 108 సిబ్బంది ఇటీవల ఆందోళనబాట పట్టారు. ఇవేమీ వారు కొత్తగా పెట్టిన డిమాండ్లేమీ కాదు. గత ఎన్నికల సందర్భంగా నాడు ప్రతిపక్ష నేత హోదాలో జగన్ ఇచ్చిన హామీలే. ఆ హామీలను అమలు చేయాలని కోరుతున్నా పాలకపక్షంలో చలనం లేదు. ఈ నేపథ్యంలో వారంతా రానున్న రోజుల్లో తమ ఆందోళనను రెండు జిల్లాల్లోనూ ఉధృతం చేయడానికి సన్నద్ధమవుతున్నారు.

రాజకీయ వైఖరిపైనా అస్పష్టత.. ప్రజా సమస్యల ఊసే కరువు

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశం భీమవరంలో అట్టహాసంగా జరిగింది. ఆ పార్టీ ముఖ్యనేతలుగా చెబుతున్న పురంధరేశ్వరి, సుజనాచౌదరి వంటి వారు గైర్హాజరవ్వగా అసమ్మతి నేత కన్నా లక్ష్మీనారాయణ దూరంగానే ఉన్నారు. ఇక కేంద్రం పథకాలనే ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు తమవి చెప్పుకుంటూ అవినీతికి పాల్పడుతున్నాయంటూ గత టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వాలపై విమర్శలు గుప్పించారు. కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని తీర్మానం కూడా చేశారు. అయితే రాష్ట్రంలోని ప్రజాసమస్యలపై చర్చే లేదు. కనీసం సమావేశాల వేదికైన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావాసులకు గతంలో తామిచ్చిన కొల్లేరు సమస్య పరిష్కారం, ఆక్వారంగం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు, నరసాపురం వద్ద వశిష్టగోదావరిపై వంతెన నిర్మాణం, కోటిపల్లి-నరసాపురం, కొవ్వూరు-భద్రాచలం రైల్వేలైన్ వంటి అంశాల గురించి ప్రస్తావనే లేదు. అంటే బిజెపి నేతలు ఏయే అంశాలపై దృష్టి సారిస్తారో.. ప్రజా సమస్యలకు ఎంత ప్రాధాన్యతనిస్తారో ఈ సమావేశాలు చెప్పకనే చెప్పాయి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ పెద్దల దగ్గర నుంచి రాష్ట్ర, జిల్లాస్థాయి నేతల వరకూ అందరిదీ అధికారమే పరమావధి తప్ప ప్రజా సమస్యలపై మాట్లాడేవన్నీ వట్టి బూటకమేనని మరోసారి స్పష్టమైంది.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

30న వృత్తిదారుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

చేతివృత్తిదారుల రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపు

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుతున్న పిచ్చుక ఆదిశేషు

ఈ నెల 30న విజయవాడలో జరిగే చేతివృత్తిదారుల రాష్ట్ర సదస్సులో వృత్తిదారులంతా పాల్గొని జయప్రదం చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం చేతి వృత్తిదారుల జిల్లాస్థాయి రౌండ్‌టేబుల్ సమావేశం రేవు రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లుగీత, చేనేత, రజక, మత్స్యకార్మిక, టైలరింగ్, వడ్రంగి వృత్తి సంఘాల నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, పిచ్చుక ఆదిశేషు, జల్లి మోహనరావు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనాదిగా ఉన్న చేతివృత్తులను ఆదుకోకుండా సర్వ నాశనం చేసే విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ బిసి అని చెప్పుకుంటూ పలు పథకాలను రద్దు చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో వృత్తిదారుల కార్పొరేషన్లు మూసేసి, కులాల కార్పొరేషన్లు పెట్టి, వాటికి నిధులు-విధులు లేకుండా చేసి వృత్తిదారులను చిన్నాభిన్నం చేసిందని విమర్శించారు. బిసి సబ్‌ప్లాన్‌కు బడ్జెట్‌లో రూ.35 వేల కోట్లు నిధులు కేటాయించడం, ఆ నిధులు ఇతర అవసరాలకు మళ్లించి వృత్తిదారులైన బిసిలను మోసగించారని ఆవేదన వ్యక్తం చేశారు. చేతి వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని, అభివృద్ధికి చర్యలు చేపట్టాలని, సంక్షేమం, సామాజిక రక్షణ, ప్రమాద బీమా, సబ్సిడీలతో కూడిన రుణాలివ్వాలని కోరుతూ ఈ నెల 30న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సులో చర్చించి భవిష్యత్ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఈ సమావేశంలో బొబ్బనపల్లి సూర్యచంద్రరావు, కిలాడి సత్యనారాయణ, రాజాన శివప్రసాద్, పాలకోడేటి లక్ష్మణరావు, జుత్తిగ శ్రీనివాస్, చెల్లబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణ అవకాశాలను రూపొందించాలి

ప్రజాశక్తి - భీమవరం

నైపుణ్య శిక్షణ అవకాశాలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో నైపుణ్య శిక్షణ సంబంధిత అధికారులతో శనివారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నైపుణ్య అభివృద్ధి కళాశాలల్లో కార్యాలయ గదులు, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడంతో పాటు ఏపి కోర్సుల్లో శిక్షణ అందించడం జరుగుతుందని సమాచారాన్ని ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఏ పిడీ వేణుగోపాల్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎ.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ఉండి

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేస్తున్న కృషి అభినందనీయమని ఉండి ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అన్నారు. ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-93లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు పాఠశాలలోని విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు బేబీరాణి ఆధ్వర్యంలో శనివారం చిత్రలేఖనం, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి నగదు ప్రోత్సాహకం, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు హాజరయ్యారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ గురువులు తోటకూర సుశీల, రేణుక ప్రసన్న, కొండూరి కృష్ణమూర్తి, పెరికల వేణుగోపాలరావులను సన్మానించారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఉపాధి హామీ చట్టంలో కొలతలకు అనుగుణంగా పని తీరు బాగుండని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని వెలగలవారిపాలెంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పని తీరును శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ 42 మంది మెయిటీ రోజు పని మొదలు పెట్టినట్లు తెలిపారు. ఆయనతో పాటు ఎపిడి వీరాస్వామి, ఎంపిడిఒ వి.పూర్ణభద్రి, ఎన్ఆర్‌జిఎస్ టెక్నికల్ అసిస్టెంట్ బాపూజీ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన మండలంలోని వెలివెల జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు ప్రముఖ దాత గారి సుబ్బారావు శనివారం నగదు బహుమతులు అందించారు. 2021లో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన చొప్పల సువర్ణ, పోతమూడి సంతోషి, 2022లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన మన్నే చంద్రశేఖర్, మట్టా గుర్నాస్వీ నగదు బహుమతి అందించారు.

అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - మొగల్తూరు

జలజీవన్ మిషన్ నిధులతో చేపట్టిన పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వైసిపి నాయకులు సూచించారు. మొగల్తూరులో ఇంటింటికి పైప్‌లైన్‌లో భాగంగా కుళాయిలు ఏర్పాటు చేసేందుకు జల జీవన్ మిషన్ నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో నాగిదేవత కాలనీలో చేపట్టిన పనులను పార్టీ నాయకులు శనివారం పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి బోణం నరసింహారావు, పడవల సత్యనారాయణ పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - అత్తిలి

రైతుల ఖాతాలో ధాన్యం డబ్బులు జమ చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రుణం మరువలేమని అత్తిలి సర్పంచి జి.విజేత అన్నారు. ధాన్యం డబ్బులు రైతుల ఖాతాలో జమ అయిన సందర్భంగా సిఎం జగన్మోహన్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు చిత్రపటాలకు అత్తిలిలో శనివారం పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మక్కా సూర్యారావు, ఎఎంసి చైర్మన్ భవానీప్రసాద్ పాల్గొన్నారు.

సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని పెదపుల్లేరు గ్రామ దేవత సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవాలు శనివారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో ఘనంగా ప్రారంభమయ్యాయని ఆలయ కమిటీ ఛైర్మన్ కలిదిండి రామకృష్ణంరాజు (పెత్తందారు కృష్ణంరాజు) తెలిపారు. శనివారం ఉదయం కలశ స్థాపనతో మొదలైన 58వ వార్షిక మహోత్సవాలు వచ్చేనెల ఫిబ్రవరి 6వ తేదీన సోమవారం అఖండ అన్న సమారాధన కార్యక్రమంతో ముగుస్తాయని ఆయన తెలిపారు. వారం రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

ఆలయాలు కిటకిట

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు కూరగాయల మార్కెట్‌లో ఉన్న కలియుగ ప్రత్యక్షదైవం వెంకటేశ్వరస్వామిని పాలకొల్లు ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి ఏడుకొండలు దర్శించుకున్నారు. ఆమెకు ఛైర్మన్ జోగి వెంకటేశ్వరరావు స్వాగతం పలికి ప్రసాదాలు అందించారు. ప్రముఖ న్యాయవాది కర్ర జయసరిత, కంద్రేకుల రాజేశ్వరి, ఇయ్యపు శశికళ స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా శ్రీ సూర్యనారాయణ స్వామి కళ్యాణోత్సవం

పాలకొల్లు కోడిగట్టున ఉన్న శ్రీ సూర్యనారాయణ స్వామి కళ్యాణ మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. నన్నయ్య యూనివర్సిటీ సెనేట్ సభ్యులు కెవి.కృష్ణవర్మ దంపతులు స్వామివారి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు.

యడ్ల బజార్‌లో ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కళ్యాణం శనివారం ఘనంగా జరిగింది.

నేరాలు - ఘోరాలు

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని ఆచంట వేమవరం పంచాయతీ పరిధి కంసాలవారి చెరువు గట్టుకు చెందిన పిచ్చెట్టి సత్యనారాయణ తాటాకిల్లు షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు వాపోతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఇది గమనించిన స్థానికులు మంటల వ్యాప్తి చెందకుండా అదుపుచేశారు. అప్పటికే ఇల్లు దగ్ధమైంది. బాధితులు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. నన్నేటి ఆనందం సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ నన్నేటి పుష్పరాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించి బియ్యం, నిత్యవసర సరుకులు అందించారు. సర్పంచి జక్కంశెట్టి చంటి బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. బాధితులను ఆచంట ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ పరామర్శించారు. ప్రభుత్వం ద్వారా అన్ని విధాలా బాధితులను ఆదుకుంటామని తెలిపారు. పరామర్శించినవారిలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ రాజ్యలక్ష్మి, వైసిపి నాయకులు పోశెట్టి లీలా సుబ్బారావు సదమళ్ల తాతాబ్బాయి, కొవ్వుల సురేష్, విఆర్ఒ రత్నకుమారి పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్ల దొంగ అరెస్ట్

ప్రజాశక్తి - తణుకు

మోటార్ సైకిల్ చోరీలకి పాల్పడుతున్న వ్యక్తిని పట్టణ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పట్టణ సిఐ ముత్యాల సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రే యపురం మండలం ర్యాలీ గ్రామానికి చెందిన కర్రీ సోమేశ్వరరావును పట్టణం లోని సజ్జాపురం అండర్‌పాస్ బ్రిడ్జి వద్ద పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.6.30 లక్షల విలువైన తొమ్మిది మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

గుర్తు తెలీని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని గుమ్ములూరు పంచాయతీ పరిధిలో పైడావ లాకు వద్ద శనివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పోడూరు ఎఎస్ఐ జిజె.విక్టర్ తెలిపిన వివరాల ప్రకారం... నెగ్గిపూడి నుంచి పెనుమర్రు వెళ్లే కాలువలో 50 నుంచి 55 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. గుమ్ములూరు విఆర్ఒ రిపోర్ట్ ప్రకారం మృతుడు స్థానికుడు కాదని, నీలం రంగు లుంగీ, పింక్, నలుపు, తెలుపు గడులు టీ షర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

త్వరలో పిహెచ్‌సిల్లో 24 గంటలూ వైద్యసేవలు

ప్రజాశక్తి - పెంటపాడు

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇకనుంచి 24 గంటలు వైద్య సేవలు ప్రజలకు అందిస్తున్నట్లు తెలుస్తోంది. రాత్రి సమయంలో కూడా వైద్య సేవలఅందించనున్నట్లు, దీనికి సంబంధించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు 90 శాతం పైగా మెటీరియల్ కూడా వచ్చినట్లు తెలిసింది. అత్యవసర వైద్య సేవల కోసం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి వెళ్లాలి. పెంటపాడు, ముదునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24 వైద్య సేవలందించేందుకు ఒక్కొక్క పిహెచ్‌సికి ఇద్దరిని నియమిస్తారు. ఈ వైద్య సేవలు ఫిబ్రవరి నుంచి ప్రారంభిం చనున్నట్లు తెలిసింది. అయితే సిబ్బంది రావాల్సి ఉంది. గ్రామాల్లో రాత్రి సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే ప్రయి వేట్ ఆసుపత్రులను ఆశ్రయించి వేలాది రూపాయలు వెచ్చిం చేవారు. పేదలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. పిహెచ్‌సిలో 24 గంటల వైద్యసేవ లందిస్తున్నారని పేద ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పిహెచ్‌సిల్లో రాత్రి సమయాల్లో కూడా వైద్య సేవలు అందించేవారు. దీనిపై పెంటపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ రాత్రి సమయాల్లో వైద్యసేవలు అందించేందుకు ఇంకా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు పూర్తిస్థాయి లో రాలేదని తెలిపారు. త్వరలోనే 24 గంటల వైద్య సేవలు ప్రారంభిస్తామని తెలిపారు.

ఫేస్ అటెండెన్స్ రద్దు కోరుతూ ధర్నా

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికొగ్నైషన్ టైం అటెండెన్స్ సిస్టం)ను రద్దు చేయాలని భీమవరం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మల్లేశ్వరరావు, ఎఐటియుసి నాయకులు సిహెచ్.రంగారావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు నిరక్షరాస్యులని, వారు ఏ విధంగా ఎఫ్ఆర్ఎస్‌ను పంపిస్తారని ప్రశ్నించారు. స్మార్ట్‌ఫోన్లను ఇవ్వకుండా ఎఫ్ఆర్ఎస్‌ను అమలు చేయాలని ప్రభుత్వం చెప్పడం దారుణమన్నారు. ఆ విధానానిన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

తాడేపల్లిగూడెం : మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి ఫేస్ రీడింగ్ అటెండెన్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సోమసుందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమసుందర్ మాట్లాడుతూ ఫేస్ రీడింగ్ అటెండెన్స్‌ను రోజుకు నాలుగుసార్లు కార్మికులే స్వయంగా మొబైల్‌లో తీసుకోవడం ఆచరణ సాధ్యం కాదన్నారు. కార్మికులందిరకీ స్మార్ట్‌ఫోన్లు లేవని, కొంతమందికి ఉన్నా వారికి యాప్‌లను వినియోగించే నైపుణ్యం లేదని చెప్పారు. హాజరు నమోదు బాధ్యతను మేస్త్రీలు, ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు నిర్వహించవచ్చన్నారు. పెరిగిన పని భారాన్ని బట్టి సిబ్బంది సంఖ్యను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఎఐటియుసి ఏరియా కమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదన్నారు. పెండింగ్ జీతాలు ఇవ్వకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్ల పోరాటానికి కమ్యూనిస్టు పార్టీ పూర్తి అండగా ఉంటుందని ప్రకటించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ గత సంవత్సరం సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. అనంతరం కమిషనర్ బి.బాలస్వామికి వినతిపత్రం అందించారు. దీనిపై ఆయన మాట్లాడుతూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని, స్థానిక సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొడమంచిలి చంద్రరావు, కె.కాటమ రాజు, మండేల్లి అంజిబాబు, మండేల్లి రామకృష్ణ, అల్లం వీరవెంకటలక్ష్మి, చాపల సావిత్రి, శారమ్మ, కోటమ్మ, జయసుధ, కనక లక్ష్మి, ధనాల లక్ష్మి, అల్లం నరేంద్ర, బి.రామాంజనేయులు, రౌతు రాజేష్, శివశంకర్, ధనాల రవి, కళింగ శ్రీను, మండేల్లి పండు, ప్రవీణ్, పంచదార గంగాధర్, సాయి, ఈశ్వర్ పాల్గొన్నారు.

భీమవరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ రెడ్డియ్య సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - పాలకోడేరు

నూతనంగా ఏర్పడిన జిల్లాలో భీమవరం డివిజన్‌కు ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒగా రెడ్డియ్య ప్రజలకు అందిస్తున్న సేవలకు గుర్తుగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చేతులమీదుగా ఉత్తమ ఉద్యోగిగా అవార్డును అందుకోవడం అభినందనీయమని ఎంపిడిఒ మురళి గంగాధర్ అన్నారు. ఉత్తమ ఉద్యోగిగా అవార్డు పొందిన పాలకోడేరు ఇఒపిఆర్‌డి, ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ రెడ్డియను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో ఎంపిడిఒ మురళిగంగాధర్ మాట్లాడారు. ఉద్యోగ బాధ్యతలు ఎంతో బాధ్యతగా నిర్వర్తించడంలో ఆయనకు ఆయనే సాట అన్నారు. రెడ్డియను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఉద్యోగి ముందుకు సాగాలని చెప్పారు. సన్మాన గ్రహీత రెడ్డియ మాట్లాడుతూ ఉత్తమ ఉద్యోగుల అవార్డు రావడం తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ అవార్డు రావడానికి ప్రతి ఉద్యోగి కృషి ఫలితమేనని అన్నారు. కష్టపడి పనిచేస్తేనే తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు రెడ్డియను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జార్జ్‌ప్రసాద్, పోలయ్య, లక్ష్మి, రాజేష్, రమాలీల, వెంకటరాజు, శ్యామ్, పెద్దిరాజు, శ్రీవిద్య, దుర్గాభవాని, దిలీప్‌కుమార్, నరేష్, మహాలక్ష్మి, సాయిబాబు, లక్ష్మీదేవి పాల్గొన్నారు.


ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ రెడ్డియను సత్కరిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

భీమవరంలో జమున సంతాప సభ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నటనకు భాష్యం చెప్పిన సినీనటి జమున ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోతుందని త్యాగరాజ భక్త సభ సభ్యులు చెరుకువాడ వెంకట్రామయ్య అన్నారు. స్థానిక కిరాణా మర్చంట్ అసోసియేషన్ భవనంలో పట్టణ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జమున సంతాప సభ శనివారం నిర్వహించారు. రంగస్థల నటులు చుక్కనశ్రీ మాట్లాడుతూ జమున మరణం సినీ జగత్తుకే తీరని లోటన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భీమవరానికి జమున షూటింగ్ మావుళ్లమ్మవారి 52వ వార్షిక మహోత్సవంలో సన్మాన కార్యక్రమానికి వచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో చిరుపవన్ తేజం సేవాసంస్థ అధ్యక్షులు ఉండపల్లి రమేష్ నాయుడు, అంకల ఆర్ట్స్ అకాడమీ సభ్యులు పరిమి రామకృష్ణ పాల్గొన్నారు.

31న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జెకెసి, వికాస వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 31న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి తెలిపారు. కాగ్నిజెంట్ సర్వీసెస్, నీట్, ఐసిఐసిఐ బ్యాంక్, మెడ్‌ప్లస్, ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్, హ్యుండాయ్, మోబిస్, ఎన్‌విహెచ్ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. డిగ్రీ, ఇంటర్ అర్హత కలిగిన 18-35 లోపు వయసున్న వారు విద్యార్హత పత్రాలతో, ఆధార్ కార్డు, బయోడేటా తీసుకుని రావాలని తెలిపారు. వివరాలకు 9441866246 సంప్రదించాలని, sridnrgdcw.ac.in వెబ్‌సైట్ చూడాలని చెప్పారు.

కుక్కల వ్యాక్సినేషన్‌కు చర్యలు

ప్రజాశక్తి - పాలకోడేరు

మండలంలో ఉన్న పెంపుడు, వీధి కుక్కలకు వ్యాక్సిన్ వేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మండల పశువైద్యాధికారి మౌర్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ, సచివాలయ కార్యదర్శులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30, 31 ఫిబ్రవరి 1 తేదీల్లో అన్ని గ్రామాల్లో కుక్కలకు వ్యాక్సినేషన్ వేసేందుకు తీసుకున్నారని, గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. గ్రామాల్లో పందులు, పశువులు సంచారం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పశువుల కబేళాల వద్ద మాంసాహారాన్ని కోసేటప్పుడు ఎటువంటి చర్యలు తీసుకుంటారఅన్నది పరీక్షించాలన్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి మురళి గంగాధర్, ఇఒపిఆర్‌డి రెడ్డియ పాల్గొన్నారు.

జువ్వలపాలెంలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - కాళ్ల

భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు జువ్వలపాలెం గ్రామ సచివాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సును పారా లీగల్ వాలంటీర్ శనివారం నిర్వహించారు. భీమవరం కోర్ట్ స్టాఫ్ భీమవరం శశికళ మాట్లాడుతూ వచ్చే నెల జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను కాక్షిదారులు ఉపయోగించుకొనేలా గ్రామ వాలంటీర్లు తెలియజేయాలన్నారు. సచివాలయం కార్యదర్శి జి.కృష్ణ శివరాజు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని దగ్గులూరు గ్రామం గవరపేట రోడ్డులో ఉన్న కుడిపూడి వీర్రాజు తాటాకిల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. విషయం తెలుసుకున్న జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ బాధితులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి విశ్వనాథం కనకభద్రం, సప్పవరపు కోటేశ్వరరావు, వీర బసవయ్య, పేరయ్య, విశ్వనాథం, మల్లికార్జునరావు,సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

అన్నపూర్ణ శతకం పుస్తకాన్ని ఆవిష్కరించిన తనికెళ్ల భరణి

మాట్లాడుతున్న తనికెళ్ల భరణి

ప్రజాశక్తి - పోడూరు

ఉపాధ్యాయులు చల్లా అన్నపూర్ణేశ్వరరావు రచించిన అన్నపూర్ణ శతకం పుస్తకాన్ని ప్రముఖ నటులు రచయిత తనికెళ్ల భరణి శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించని కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాష తెలుగును అందరూ తల్లితో సమానంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, డిటిడిసి బాబు, సర్పంచి జమ్ము బేబీమహాలక్ష్మి, ప్రముఖ సాహితీవేత్త కడిమిల్ల వరప్రసాద్, మధురకవి మాంకు శ్రీను, మేదిచర్ల సూర్య గోపాల కృష్ణ పాల్గొన్నారు.

పెనుగొండ : అఖిల భారత వాసవి ట్రస్ట్ పెనుగొండ నాలుగో వారోత్సవం సందర్భంగా సినీ నటులు తనికెళ్ల భరణి వాసవీ మాతను శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భరణిని శ్రీ వాసవీ మాత ట్రస్ట్ అధ్యక్షులు పిఎన్.గోవిందరాజులు సత్కరించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రిషి ప్రతిభ

ప్రజాశక్తి - ఆచంట

కర్నూలులో ఈనెల 23, 24, 25 తేదీల్లో జరిగిన అండర్ 17 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పశ్చిమ గోదావరి జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఈ జట్టులో కొడమంచిలి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి కోట రిషి అత్యధిక పాయింట్లతో తన ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా అతనికి ప్రభుత్వం నుంచి సిల్వర్ మెడల్, సర్టిఫికెట్ మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ అందించి అభినందించారు. ఈ సందర్భంగా సీతారామ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతమైన కొడమంచిలి గ్రామం నుంచి క్రీడాకారుడిగా ఎదిగి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. రిషిని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొమ్మేటి రాంబాబు, ఎస్ఎంసి ఛైర్మన్ బొరుసు రాంబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు చిరంజీవి, టిఎన్‌డి చంద్రశేఖర్ అభినందించారు.


సిల్వర్ మెడల్, సర్టిఫికెట్ అందుకున్న రిషి

ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పుల వల్ల పనులు ఉండడంలేదని, ఈ నేపథ్యంలో ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషపు ఆశ్రియా డిమాండ్ చేశారు. పాలకోడేరు ప్రజాసంఘాల కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రియా మాట్లాడుతూ ఉపాధి కూలీలు చాలీచాలని వేతనాలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించడంతో పాటు రూ.600 వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు అండగా ఉపాధి హామీ చట్టాన్ని మరింత పటిష్టపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ చట్టంలో పనిచేస్తున్న కూలీలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దున్న మరియమ్మ, లక్ష్మి, వెంకటేశ్వరరావు, జ్యోతి, వి.వెంకటేశ్వరరావు, లక్ష్మణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు శ్వేత

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది బొక్క శ్రీనివాసరావు కుమార్తె శ్వేత రాష్ట్రస్థాయి సందేశాత్మక పోటీలకు ఎంపికైంది. జిల్లా స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన శ్వేతను భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి యోహాను న్యూటన్ అభినందించారు. కండెల భీమారావు, శ్యామ్‌చరణ్, పి.అంబేద్కర్, కె.నాగరాజు, పలువురు న్యాయవాదులు శ్వేతను అభినందించారు.

శ్వేత

1న ఎస్‌వికెపి కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - పెనుగొండ

ఎస్‌వికెపి డిగ్రీ కళాశాలలో ఫిబ్రవరి ఒకటో తేదీన గ్రాడ్యుయేషన్ డే నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవివి.అప్పారావు తెలిపారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ వైఎస్ఆర్ ఆర్టికల్చర్ యూనివర్సిటీ ఛాన్స్‌లర్ డాక్టర్ పి.జానకిరామ్, మాజీ మంత్రి చెరుకువాడ రంగనాధరాజు, రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ సిహెచ్.కృష్ణ, అగ్రికల్చర్ ఇన్‌ఛార్జి డాక్టర్ భారతిలక్ష్మి, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ,బిసి కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ తమ్మయ్య హాజరవుతారని తెలిపారు.

ప్రతి ఎకరానికీ పూర్తిస్థాయిలో నీరు

పెనుమంట్ర : రైతుల కోరిక మేరకు ఎఒల సలహాల మేరకు త్వరలో పొలంబడి కార్యక్రమాలకు శాస్త్రవేత్తలను పంపిస్తామని మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ ఎడిఆర్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి అన్నారు. సంస్థలో శనివారం నిర్వహించిన సమావేశంలో భరతలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఎఒల వద్ద మినీ కిడ్ విత్తనాలు అందుబాటులో ఉండాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దాళ్వా పంటలో ఎక్కువగా జింక్ లోపం వస్తుందని, దీని అరికట్టడానికి రైతులకు కాంప్లెక్స్ ఎరువుల వాడకంపై అవగాహన కల్పించాలని చెప్పారు. దాళ్వా పంట వంతులవారీ విధానం ప్రారంభమైనప్పటికీ ప్రతి ఎకరానికి పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వరి ప్రథమ శాస్త్రవేత్త డాక్టర్ టి.శ్రీనివాస్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.చారుమతి, సస్య విజ్ఞాన విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్రీనివాస్, తెగుళ్ల విభాగం సీనియర్ శాస్త్రవేత్త వి.భువనేశ్వరి పాల్గొన్నారు.

పేరు మార్పు

చెన్నారెడ్డి స్వరూప్, తండ్రి : ఎమ్‌విఆర్ఎస్ఎస్ నాగభూషణం, నివాసం : డి.నెం.7-77, చెన్నారెడ్డివారి వీధి, కైకరం గ్రామం, ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నా యొక్క పాన్‌పోర్ట్ (నెం.K2759345) లో నా యొక్క తండ్రి గారి పేరు నాగ భూషణం చెన్నారెడ్డి అని, అనితప్పుగా నమోదు కాబడినది. కాని నా యొక్క ఆధార్ మరియు డ్రైవింగ్ లైసెన్స్‌లో నా తండ్రి గారి యొక్క సరియైన పేరు ఎమ్‌విఆర్ఎస్ఎస్ నాగ భూషణం చెన్నారెడ్డి గా అన్ని వ్యవహారాలలో వ్యవహరించవలెను.

ప్రకటన

మహారాజశ్రీ నిడదవోలు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు
I.A.No.5/2023, I.A.No.6/2023 in O.S. No.73/2009

Between :
Bodapati Suryavathi (Died) and Others ...Petitioners/Plaintiffs
Vs
Kamisetti Venkataratnam (Died) and Others ...Respondents/Defendants

To:
9th Defendent
Respondent : Sri Suravarapu Radhakrishna, S/o. Late Gangaraju, Age 50 years, D.No. 20-10-42, Velpur Road TANUKU ...Tanuku PJCJC
10th Defendent
Respondent : Smt. Boddana Saradha, W/o. Mahesh, Age 46 years, Hindu Female, D.No. 20-10-42, Velpur Road TANUKU ...Tanuku PJCJC

పై నంబరు పంపకం దావాలో 3వ ప్రతివాది అయిన శ్రీమతి సూరవరపు సత్యవతి గారు మీకు తల్లిగారు అయివున్నారు, మీ తల్లిగారు పైదావానందు మొదటి దశలోనే ఎక్స్‌పార్టీ అయి ఉన్నారు, దరిమిలా మీ తల్లిగారు చనిపోయినారు అని తెలియవచ్చినది కావున వారి స్థానే వారి వారసులు అయిన మిమ్ముల్ని పైపంపకం దావాలో 9 మరియు 10వ ప్రతివాదులు గా చేర్చమని పిటిషన్ దాఖలు చేసియున్నందున శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ది.08-02-2023 సం॥రం తేదిన ఉ.గం. 10-30 ని॥ల లగాయితూ మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడును.

Place : Nidadavole
Date : 28.01.2023
K.S.N. MURTHY, Advocate, Nidadavole

పాస్‌పోర్టు పోయినది

MYLABATHULA JEEVAN KUMAR అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది. 05-02-2013న K9437863 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. ఆగర్తిపాలెం గ్రామం నుండి నరసాపురం పట్టణంలోని మా బంధువుల ఇంటికి వెళ్ళిన సందర్భంలో సదరు పాస్‌పోర్టు జిరాక్సు కాపీలు తీయించుకునేందుకు మెయిన్‌రోడ్డుకు వెళ్ళినప్పుడు నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన, నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

MYLABATHULA JEEVAN KUMAR
S/o. M.Benny paul, D.No. 2-36
Agarthipalem, Agarru Post, Palakol Mandal
West Godavari Dist., A.P.,

In The Court Of The IInd Addl. District Judge :: Amalapuram
O.S.No. 6/2022

Between:
వెల్లంకి కామేశ్వరి వగైరాలు ...పిటీషనర్లు
మరియు
కుకునూరి (కొంపెల్ల) వీరవెంకట సత్యనారాయణ వగైరాలు ...రెస్పాండెంట్లు
1) కుకునూరి (కొంపెల్ల) వీరవెంకట సత్యనారాయణ, తండ్రి: బుల్లిబ్బాయి, డో.నె. 1-1-20, స్టీయర్‌రోడ్, నరసాపురం, పశ్చిమ గోదావరి జిల్లా.
2) కుకునూరి (కొంపెల్ల) సాయిఉదయ్, తండ్రి: వీరవెంకట సత్యనారాయణ, డో.నె. 1-1-20, స్టీయర్‌రోడ్, నరసాపురం, పశ్చిమ గోదావరి జిల్లా.
...రెస్పాండెంట్లు 1 మరియు 2

పై నెంబరు దావాలో పిటీషనర్లు వేసిన ఐ.ఎ.నెం. 135/2022, ఐ.ఎ.నెం. 136/2022 మరియు ఐ.ఎ.నెం. 137/2022లో నోటీసులు శ్రీ కోర్టు ద్వారాను, పోస్టల్ ద్వారాను పలుపర్యాయములు పంపించగా అమలు జరగనందున సదరు రెస్పాండెంట్లు 1, 2 లకు ఐ.ఎ.నెం. 135/2022, ఐ.ఎ.నెం. 136/2022 మరియు 137/2022లో అమలు నిమిత్తం ది.30-01-2023వ తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట ఉదయం గం॥10:30 ని॥లకు హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలియపరుచుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

అడపా వెంకట సత్యప్రసాద్,
అమలాపురం, గుండాబత్తుల బాల రవితేజ,
27-01-23. అడ్వకేట్స్, అమలాపురం.

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 199/2015

Petitioner (వాది): పెపసింగ్ రోజ
Defendants (ప్రతివాదు):
1. బొడ్డు రాజారావు (died) & 4 Others

4th రెస్పాండెంటు అడ్రస్సు:
D-4: కొరు లక్ష్మి, D/o. late బొడ్డు రామస్వామి, 25వ వార్డు, భీమవరం.

5th రెస్పాండెంటు అడ్రస్సు:
D-5: మోరి రావమ్మ, D/o. late బొడ్డు రామస్వామి, 25వ వార్డు, భీమవరం.

పై నంబరు పిటిషనులో పిటిషనరు మీకు నోటీసులను కోర్టు మరియు పోస్టు ద్వారా ఎన్నిసార్లు పంపిన మీరు తీసుకొనక Avoid చేయుచున్నందున మీరు ది. 06-02-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై స్వయముగా గానీ, అడ్వకేటు ద్వారా గానీ మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనియెడల పై పిటిషను పై కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించెదరు.

కె.రాజశేఖర్
భీమవరం పిటిషనరు తరపు అడ్వకేటు
ది.25-01-2023 భీమవరం

ప్రకటన
మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 239/2018

వాది: శీరం నాగేంద్రరావు
ప్రతివాదులు:
1) దేవాబత్తుల పెద్దింట్లు
2) దేవాబత్తుల రత్నంరాజు
3) దేవాబత్తుల డేవిడ్
4) పెల్లూరి మరియమ్మ
5) దర్శి విజయ
6) మార్త జయ
7) ముసల దయామని
8) దేవాబత్తుల బులివెంకమ్మ
9) బల్లారపు జాన్సీరాణి, భర్త: తెలియదు, 1వ వార్డు, డో.నెం. 1-39, గణపవరం.

వాది దాఖలు చేసిన పై దావాలో 9వ ప్రతివాదికి వాదన ఉన్న ఎడల పై కోర్టు వారి ఎదుట ది.28-02-2023వ తేదీ పగలు గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మనవి చేసుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమందు పై కోర్టు వారు వాది పక్షం ఉత్తరువులు జారీ చేయుదురు.

మందరపు వెంకటాచారి
భీమవరం, వాది తరపు అడ్వకేట్,
27-1-23. భీమవరం. సెల్: 98485 02377